# ముక్కుపుడక

(ముక్కుమీద తళుక్కుమని మెరిసే ముక్కుపుడకంటే
అతనికిష్టం. ఆ ఇష్టాన్ని తన భార్య తీర్చదు.
ఇష్టాన్ని తీర్చే అమ్మాయి తన భార్య కాదు!
పర్యవసానం?)

× ×

ఆమెను తొలిసారి "రాఘవ సినీకాంప్లెక్స్"లో చూశాడు రజనీష్ శ్రీమతి లేకుండా సినిమాకు వెళ్ళడం, ఆమె ఒంటరిగా దర్శనమివ్వడం—అనుకోకుండా జరిగింది.

అద్దాల దగ్గరగా ఆమె నిలుచొనివుంటే చలువరాతి శిల్పంలావుంది. ఆమెకు అంత అందం ఎలా వచ్చింది? బాగా గమనించాడు రజనీష్ దాపుకు దారితీశాయి కాళ్ళు దగ్గరగా చూడాలన్నాయ్ కళ్ళు చూశాడు ఆమె ఎటో చూస్తూవుంది. ఈ ఆడవాళ్ళ అభి జాత్యమే అంత? అందాన్నంతా పరిచి, అమాయకంగా వుండటం, సౌందర్యానికి ఎంత మంచి భావ ప్రకటన వుంది?

ఆమె అతిలోక సౌందర్యంతో వెలిగిపోవడానికి కారణం కనిపించింది—

చక్కని ఆమె ముక్కుపై తళుక్కున మెరుస్తున్న "ముక్కుపుడక"—!!

ఆమెలో వెలుగుతున్న సొగసు ఆ పుడకలోంచి ప్రజ్వలిస్తూవుంది. ఆమె అందానికి అదో ప్రేమ పతాకంలా ప్రకాశిస్తోంది!!!

'ముక్కుపుడక' అంటే రజనీష్‌కు చాలా ఇష్టం మరీ ఈ రోజుల్లో ఎందరో ఆడవాళ్ళు అలా పుడకలు కుట్టించుకుంటున్నారు

తన హృదయపు లోతుల్లో ముద్దుగా, మురిపెంగా చిగురించిన ఆ భావాన్ని "శ్రీమతి"కి చెప్పి చెప్పి మానుకున్నాడు.

రాజేశ్వరికి ముక్కు కుటించుకోవడమంటే పెద్ద చిరాకు; చీకాకూను.

రజనీష్ ఎంత నచ్చజెప్ప చూసినా వినిపించుకోలేదు. పైగా వాళ్ళన్నయ్యదో అభ్యంతరము; ముక్కు కుట్టించుకున్న ఆడదాన్ని చస్తే తను పెళ్ళి చేసుకోనని శపథం చేశాడు కూడా.

ఆడవాళ్ళు హాయిగా, ప్రకృతి సిద్ధంగా వుండాలన్నది అతని అభిప్రాయం.

వాళ్ళన్నయ్య వాదంతో రాజేశ్వరికి మరింత బలం దొరికింది పెళ్ళి కాని కన్నెపిల్లల కలల కానుక అది—అంతేకాని పెళ్ళయ్యాక ముక్కు కుట్టించుకోవడమేమిటి?'— అంటూ ఒకే మూతి విరుపులు. అర్ధాంగి అప్పుడప్పుడు అలా మూతి విరిచినప్పుడు కదులాడే ముక్కుపై పుడక వుంటే ఎంత అందం?— అన్నది రజనీష్ ఆలోచన.

అవతలింటి అండాలమ్మ ఆరుగురు బిడ్డల తల్లి ముక్కు కుట్టించు కోగా లేనిది, పెళ్ళయి రెండేళ్ళయినా నిండని మనకేటి?— అన్నా వినలేదు.

అవసరమైతే అమ్మగారింటికి వెళ్ళేందుకు సిద్ధపడింది కానీ, ముక్కు మాత్రం కుట్టించుకునేది లేదని భీష్మించుకుంది.

రజనీష్ దృష్టిలో—

అందమైన ఆడవాళ్ళ ముక్కుమీద ఒంటిరాయి పుడక వెలుగుతూ వుంటే— రాజసం పుట్టి పడుతుందనీ, దేవతల్లా అగుపిస్తారనీ—

బెల్ అయింది.

రజనీష్ ఆలోచనలు తెగిపొయ్యాయ్.

సినిమా మొదలవబోతున్నట్లుంది.

ఆమె కదిలింది.

ముక్కుపుడకలో మెరుపు-తీగై. ముందుకుసాగి, ఆమెకు స్వాగతం చెప్పింది. అయత్నకృతంగా రజనీష్ పాదాలు కదిలాయి థియేటర్ ఎయిర్ కండీషన్.... హాయిగా వుంది. ఆమె రజనీష్‌వున్న వరసకు రెండు వరసల వెనక సీట్లో కూర్చుంది.

లైట్లు ఆఫ్ చేశారు.

ఆమె హాయిగా ఆరు బయట తిరిగేటప్పుడు ఆ అందాన్ని తనివితీరా చూసి వుంటాయ్ ఆకాశంలోని అనంత నక్షత్రకోటి. అందులోని ఒకటి ఆత్రుతను అణుచుకోలేక, తెగి, క్రిందికి దూకి, అమాంతంగా ఆమె ముక్కుపై నిలిచిపోయి వుంటుంది....ఆమెలో భాగమై పోవాలన్న ఆశతో.

అందుకే ఆముక్కుపుడక అంధకారంలో కూడా అనంతమైన వెలుగును వెదజల్లుతూ వుంది నక్షత్రంలా.

ఆమె కళ్ళు వెండితెరమీద, రజనీష్ కళ్ళు ఆమె ముక్కుపుడక మీద వున్నాయ్. సభ్యతకు భంగం వాటిలకుండా దొంగతనంగా చూడ సాగాడు 'ముక్కుపుడక వైభవాన్ని' మెడనొప్పి కూడా తెలియడంలేదు.

కన్నార్పితే ఆ ముక్కుపుడక దేవత అదృశ్యమవుతుందేమోనన్నంత ఉత్కంఠతో.... అనిమిషుడయ్యాడు రజనీష్.

రెండవసారి——

పినాకిని సూపర్‌మార్కెట్‌లో దర్శనమిచ్చింది ఆమె

ఎవరో మరో అమ్మాయితో మాట్లాడుతోంది. మధ్య మధ్య మనోహరంగా నవ్వుతోంది మాట్లాడుతున్నప్పుడు, నవ్వుతున్నప్పుడు ముక్కు పుటాలపై తళుకులీనుతూ, స్టోరీ చేస్తున్న ఆ పుడక... ఓహ్.... ఎంత అదృష్టం చేసుకుందో.

"ఏం కావాలి సార్?"

ఏదో కొనబోతున్నట్టు అక్కడ నిలుచునివున్న రజనీష్ ముక్కు పుడక కావాలి అన్నమాట గొంతువరకువచ్చి ఆగిపోయింది.

"ఆ(....! నోస్....నోస్....కాదు. ఫేస్.... ఫేస్ పౌడర్ కావాలి" అన్నాడు తడబడుతూ. ఇంకా అలాగే చూస్తూ ఆ సౌకుమార్యాన్ని ఆస్వాదిస్తూ.

ఆమె వెళ్ళిపోతూవుంది ఎవరినీ లెక్కచేయని రాజకుమారిలా........

రజనీష్ కూడా అనుసరించాడు.

షాప్‌కీపర్ మాటలు వినిపించలేదు రజనీష్‌కి.

మూడవసారి—

రాజరాజేశ్వరి గుడి దగ్గర దర్శనమిచ్చింది ముచ్చటగా, కొంతమంది అమ్మాయిలతో కలిసి ధవళ వస్త్రధారణలో దివినుంచి భువికి ఊడిపడ్డ అప్సరాంగనలా,

పనిమీద నిహ్పో ఫ్యాక్టరీకి వెళుతూ, ఆమె గుడిలోకి వెళ్ళడం చూశాడు రజనీష్ వెంటనే ఆగిపోయి,

ఆగలేక ఆమెను అనుసరించాడు-నైవేద్య వస్తువులు కొనుక్కొని.

ఆమెతోపాటు గర్భగుడిలోకి దూరాడు, సందు చేసుకుని.

'దేవి'కి హారతి జరుగుతోంది.

ఆ కర్పూర వెలుగులో చూశాడు ఆమెను – కాదు ఆమె దివ్యమంగళ విగ్రహాన్ని! దేదీప్యమానంగా మెరుస్తోంది నిలువెల్లా!!

ఉలిక్కిపడ్డాడు రజనీష్—

అమ్మవారి విగ్రహానికీ ఆమెకూ బాలా దగ్గర పోలికలున్నాయ్— ముఖ్యంగా ముక్కుపుడకలో! అయితే అమ్మవారి పుడక కొంచం పెద్దది. ఆమె పుడక చిన్న రవ్వలా వుంది—అంతే తేడా!!

అంతా అలంకరించి, 'ఆమె'నూ అక్కడ అదే భంగిమలో కూర్చో బెడితే ఆమె కూడా ఆ 'దేవత'లా వుంటుంది.

హారతి కళ్ళకద్దుకోవాలని ఆమె ముందుకు వంగినప్పుడు, తనూ ముందుకు వంగాడు. క్షణ మాత్రం లభించిన ఆమె మృదు స్పర్శకు పరవశించి పోయాడు రజనీష్.

అపూర్వమయిన అనుభవం అది!

గుడిలోని దేవి ప్రత్యక్షమయినా అది అంత అద్భుతం కాదు; కా లే దు.

ఆమె మాత్రం యిదేమీ పట్టించుకున్నట్టు లేదు.

భక్తి భావంతో, అరమోడ్పు కన్నులతో తదేకంగా దేవిని చూస్తూ— ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ వుంది.

దాదాపు అదే స్థితిలో, అంతే ధ్యానలో ఈ దేవిని; ఆమె అణు వణువులోని కాంతిని బహిర్గతం చేస్తున్న ఆ ముక్కు పుడకనూ చూస్తున్న రజనీష్‌కు—ఆమె పాదాలపై పడిపోవాలనిపించింది. ఆమె దయలేక మరో క్షణం బ్రతకలేననిపించింది.

ఇంతలో ఆ దేవత కదిలిపోయింది—శిలచలించినట్టు, ప్రాణం పోసుకున్న శిల్పసుందరి సుతారంగా నడిచిపోతున్నట్టు, గుడిలో దేవతను తిట్టుకున్నాడు రజనీష్!

❀ ❀ ❀

ఆలయ ప్రాంగణంలో........

పచ్చ గన్నేరుచెట్టు క్రింద పుచ్చపువ్వులా నిలుచునివున్న 'ఆమె' ఒంటరిగా కనిపించింది నేస్తాలు దూరంగా బావిదగ్గర చేతులు కడుక్కుంటూ, ఏవేవో కబుర్లాడుకుంటూ కనిపించారు.

"ఆమె" అప్పటికే కడుక్కొచ్చిందేమో, చేతులమీద చెమ్మను తుడుచుకుంటూ కనిపించింది.

ఆగలేక దగ్గరికెళ్ళాడు రజనీష్—

ఆమె "హాంకీ" వానిటీబాగ్‌లో పెట్టుకుంటూవుంది వొయ్యారంగా.

ఆమె ప్రతి కదలికకూ ముక్కుపుడక కాంతి సంకేతాలు ప్రసారం చేస్తూ హొయలు చిలుకుతోంది. అపూర్వమయిన లిపిని ఆవిష్కరింప జేస్తోంది.

"ఎక్స్‌క్యూజ్మి"— ఎలాగో గళాన్ని శృతి చేయగలిగాడు రజనీష్.

"ఎస్" అంటూ గిరుక్కున తిరిగి రజనీష్‌ను చూసిన ఆమె కళ్ళు రవ్వంత విస్మయాన్ని చిందించాయి.

"మీరు వదిలేలా లేరే" అన్నభావాన్ని రజనీష్ అనువదించు కున్నాడు, ఆమె చూపులో—

"నా పేరు రజనీష్, బి యల్. పూర్తిచేసి, అంప్రెంటీస్ చేస్తున్నాను" గొంతు సవరించుకున్నాడు రజనీష్.

"ఆఁ హాఁ" అన్నవి ఆమె పెదవులు మృదువుగా.

'ఇలాగే చేస్తున్నావా, అంప్రెంటీస్?'—అన్న అర్థం స్ఫురించింది— ఆమె పెదవి వంపులో.

"మీరో?......" అడగకుండా వుండలేక పోయాడు ఆడవాళ్ళ పరిచయంకోసం—అందు నా మనసైన ఆడవాళ్ళ అభిమానాన్ని చూరగొనే కోసం—మగవాళ్ళు ఎన్నో దార్లు వెదుక్కుంటారు. అతివలను పరిచయం చేసుకోవడంలో, ఆకర్షించడంలో అందమైన మార్గాలు అరవైఆరు వున్నాయి అయితే ఆయా వ్యక్తుల అంతరంగాన్నిబట్టి, స్థాయినిబట్టి పరిసరాలనుబట్టి ఎన్నుకోవలసి వుంటుంది సరియైన మార్గం. అందులో చూపులు కలపడం ఒక సూత్రమైతే, మాటలు కలపడం మరో సూత్రం ఇప్పుడా దారిలో వున్నాడు రజనీష్.

''నా పేరు కీర్తి ! ఈ ఊరికి కొత్తగా వచ్చాను బ్యాంకులో జాబ్ చేస్తున్నాను". అంటూ క్లుప్తంగా ముగించింది తన పరిచయం

''కీర్తి........అందమైన పేరు........"— అని తనలో అనుకుని, "మీ వారూ........" అంటూ అర్థోక్తిగా ఆగిపోయాడు రజనీష్. మరో మెట్టు పైకెక్కుతూ

మగబుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు !

కీర్తి నవ్వింది

నవ్వుతోపాటు గుప్పున పరిమళించాయి. ఆమెలోంచి బహిర్గతమైన సుగంధ వాసనలు—

ముక్కుపుడక నిక్కి చూసింది ముక్కుపుటాలపై చెక్కు చెదరని కాంతి లీనుతూ—

'పద్మినిజాతి స్త్రీ' అంటే ఈమెకామోసు !

రజనీష్ అనిమేషంగా ఆమెనే చూస్తూ పెదవి విప్పి, ఏదో చెప్ప బోయాడు. ఇంతలో ఆమె నేస్తాలు ఆమెను చేరుకున్నారు, వారితో కలిసి. ఆమె వెళ్ళిపోయింది,

వెళుతూ, వెళుతూ ఒక్కసారి — ఒకే ఒక్కసారి — వెనుతిరిగి చూసింది కీర్తి.

ఆమె ముక్కుపుడకలోంచి దూసుకొచ్చిన కాంతి కిరణం రజనీష్ హృదయంలో సూటిగా గుచ్చుకుని, తియ్యని గాయం చేసింది.

* * *

అ వా ళ—

ఉదయాన్నే పనిమీద వెళ్ళిన రజనీష్ సాయంకాలం నాలుగు గంటలకు కానీ ఇల్లు చేరుకోలేక పోయాడు

'ముక్కుపుడక దేవత' మూతి బిగింపు—శృతిగా పుడక నిగారింపు- ఆమె పలకరింపు — ఆ పైన పులకరింపు — మరిచిపోలేక పోతున్నాడు రజనీష్ ! గర్భగుడిలో దేవతా విగ్రహం ముందు కర్పూరపు వెలుగుల్లో మరో దేవతలా కనిపించిన — ఆ మనోజ్ఞ దృశ్యాన్ని పదేపదే అవలోకించు కుంటున్నాడు

కలవాలి - మాట్లాడాలి - ఎన్నో మాట్లాడాలి - తనివితీరా మాట్లాడాలి - హృదయాన్ని విప్పాలి—అలాగే చూస్తూ ఆమె ఎదుట కూర్చోవాలి—దగ్గరగా ఆమె ముక్కుపుడక సొగసు చూడాలి - పుడక క్రింది చర్మ సోయగాన్ని చూడాలి - చర్మం కింది రహస్యాలు చూడాలి - ఆమె రక్త నాళాలలోని రంగులు చూడాలి — ప్రవహిస్తున్న నీలిరక్త లావణ్యాలు చూడాలి - సెకనులు - నిమిషాలు - గంటలు - రోజులు. సంవత్సరాలు-యుగాలు - అలాగే చూస్తూ వుండాలి స్పేస్ షటిల్‌లో ఇద్దరం కలిసి దూర లోకాలకు ఎగిరిపోవాలి.

ఈ ఆలోచనలతో వేగి, వేడెక్కిపోతున్న రజనీష్ —
ఈ మధ్య రెండు, మూడు మైనర్ యాక్సిడెంట్స్‌కు గురయ్యాడు.

ఆ దేవత దర్శనం ఎందుకో దుర్లభమయింది. ఎక్కడెక్కడో వెదికాడు, తిరిగాడు — కనిపించలేదు. ఏ దూర తీరాలలో — ఏ పూల వనాలలో - విహరిస్తోందో; విరబూస్తోందో !!

ఆమె పిచ్చిలో ఇంటికి చేరుకున్న రజనీష్‌కు ఎదురుగా 'ముక్కుపుడక దేవత' ప్రత్యక్షమయింది.

అంతులేని ఆనందంతో ఆలాగే ఆకాశంలోకి ఎగరబోయాడు.

ఇంతలోనే తమాయించుకుని, కళ్ళకెక్కిన సౌందర్య నిషాను విదిలించుకుని, చూశాడు - నమ్మలేనట్లు !

ఎదురుగా వున్నది తన భార్య !!

తను అగ్ని సాక్షిగా పెళ్ళాడిన రాజేశ్వరి !!

అవును రాజా-ముక్కుపుడక కుట్టించుకుని వుంది, ఎంచక్కా !

ముక్కుపుడక నిగనిగ మంటోంది !

ఎంతటి ధీరుణ్ణయినా ఆజ్ఞాపించేలావున్న ఆ ముక్కుకు చిన్న చుక్కలావున్న ఆ పుడక కడుపులో ఎంతటి వెలుగు?

కీర్తి కన్నా - కాంతికన్నా - మిన్న ఈ అన్నుల మిన్న !!

"జో!" ప్రేమ పొంగి పొరలినప్పుడు తన అర్ధాంగిని అలా ఒక్క అక్షరంతో పిలుస్తాడు రజనీష్. రాజేశ్వరి నవ్వింది.

ముక్కుపుడక తళుక్కుమంది.

"రండి! రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాము" అంటూ, అక్కడ సోఫాలో అటువైపు కూర్చొని వాళ్ళ పెళ్ళి ఫోటో అల్బమ్ చూస్తూ వున్న యువతిని చూపుతూ, "ఈమె ఈ మధ్యే షాపింగ్‌లో పరిచయ మయింది. ఎంత మంచిదో. మనింటికి రెండు, మూడుసార్లు వచ్చింది. పరిచయం చేద్దామంటే సమయానికి మీరు లేరు. మన పెళ్ళి ఫోటోలు చాలా బాగున్నాయని మెచ్చుకుంది. నాకు ముక్కుపుడకుంటే - నేనింకా బావుంటానని ఒకటే పోరు. ముక్కు కుట్టించుకునేవరకు వదల్లేదు. తనే సెలక్ట్ చేసి దగ్గరుండి మరీ కుట్టించింది. ఈ ముక్కుపుడక అందంగా లేదూ? ఎలాగయితేనేం మీరే గెలిచారు" అంటూ ఆ యువతిని పరి చయం చేసింది

ఆమె లేచి నవ్వుతూ, వినమ్రంగా నమస్కరించింది.

రజనీష్ స్థాణువయ్యాడు.

ఆమె కీర్తి!

భార్యకేసి చూశాడు. అయోమయంగా—

నిండుగా నవ్వుతూ వుంది రాజేశ్వరి.

కోటి కాంతులు, శతకోటి భావాలు, అవ్యాజ్య ప్రేమ - ఆమె ముక్కు పుడకలో తొణికిసలాడుతూ మెరిశాయి—

—: జై హింద్ :—

("జో"కి ప్రేమతో అంకితం — రచయిత.)